ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ అన్ని నియోజకవర్గాల్లో విజ్ఞాన్ పత్రికకు విలేఖరులు కావలెను
ఫోన్ నెం. 99517 75293

VIGNAN PATRIKA

APTEL/2024/89102

# విజ్ఞాన్ పత్రిక

తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)

సంపుటి : 02 సంచిక : 32 ఎడిటర్ : కలికి ఉదయ్ కుమార్ రెడ్డి శుక్రవారం 27 ఫిబ్రవరి 2026 పేజీలు : 04 వెల : 02



"పోలవరం అతిపెద్ద ప్రాజెక్టు ఎమ్మెల్యేలందరూ ఒకసారి చూసి రావాలి. పోలవరం వంటి పెద్ద ప్రాజెక్టు దేశంలో మరొకటి నిర్మించే అవకాశం లేదు. పుష్కరాల కంటే ముందు పోలవరాన్ని పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. అన్ని రిజర్వాయర్లు కళకళలాడుతు న్నాయంటే ప్రభుత్వ దూరదృష్టి. ప్రతి ఎకరాకు సాగునీరు ఇవ్వాలని మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి ఇంటికి నాణ్యమైన తాగునీరు అందించేలా చర్యలు."- చంద్రబాబు, సీఎం

# పోలవరం-నల్లమల సాగర్ అనుసంధాన ఏ రాష్ట్రానికీ నష్టం లేదు : సీఎం చంద్రబాబు

- నదుల అనుసంధానంతో నీటి సమస్యలు తగ్గుతాయి: సీఎం చంద్రబాబు
- పోలవరం-నల్లమల అనుసంధానంతో రెండు రాష్ట్రాలకూ లాభమేనన్న సీఎం చంద్రబాబు
- వచ్చే ఏడాది మే 15 నుంచే నారుమళ్లకు నీరందించేలా ప్రణాళికలు సిద్ధం
- నీళ్లు రాకుండానే వెలిగొండకు రిబ్బన్ కట్ చేసి గత పాలకులు క్రెడిట్ కొట్టేశారు
- రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై త్వరలోనే బ్లూప్రింట్ విడుదల చేస్తామని వెల్లడి
- ప్రతి ఎకరాకు నీరందించి తెలుగు తల్లికి జలహారతి ఇవ్వడమే లక్ష్యమని స్పష్టీకరణ
- సాగునీటి రంగంపై శాసనసభలో మాట్లాడిన సీఎం చంద్రబాబు
- పోలవరం-నల్లమల సాగర్ లింకు ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టం లేదు
- గోదావరి నుంచి వృథాగా సముద్రంలోకి వెళ్లే వరద జలాలను తరలిస్తామని వెల్లడి
- శాసనసభలో సాగునీటి రంగంపై జరిగిన చర్చలో చంద్రబాబు ప్రసంగం

## 'మా కుమార్తె చికిత్సకు సాయం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు'

: పునర్విక తల్లిదండ్రులు

- అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి పునర్విక చికిత్స కోసం ముందుకొస్తున్న దాతలు
- ఇంజెక్షన్‌కు అవసరమైన రూ.6 కోట్లు సమకూరుస్తానని తెలిపిన నారా లోకేశ్
- మంత్రికి, దాతలందరికీ ధన్యవాదాలు తెలిపిన చిన్నారి తల్లీదండ్రులు



## రేపు రాష్ట్రానికి సీజేఐ

రెండు రోజులు పర్యటించనున్న జస్టిస్ సూర్యకాంత్

తిరుపతి, అమరావతిలో పలు కార్యక్రమాలకు హాజరు

జ్యుడీషియల్ అకాడమీ, హైకోర్టు గెస్ట్‌హౌస్‌కు శంకుస్థాపన

న్యాయమూర్తుల నివాస సముదాయానికి ప్రారంభోత్సవం

బెజవాడలో మధ్యవర్తిత్వంపై సింపోజియం



## జూబ్లీహిల్స్‌లో భారీ అగ్నిప్రమాదం

- ప్రాణాలతో బయటపడిన ఆ నలుగురు
- జూబ్లీహిల్స్ మెట్రోస్టేషన్ సమీపంలో భారీ అగ్ని ప్రమాదం
- వస్త్ర దుకాణంలో భారీగా ఎగిసిపడిన మంటలు
- ఫైరింజన్లతో మంటలు ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది
- ఖాళీగా ఉన్న వస్త్రదుకాణం స్టోర్



హైదరాబాద్ నగరంలో అగ్నిప్రమాదాలు జరగడం, కొన్ని సార్లు ప్రజలు ప్రాణాలు కోల్పోవడం, మరికొన్నిసార్లు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బయటపడటం కొత్తేమీ కాదు. జనవరి నెలలో నాంపల్లిలోని ఫర్నిచర్ దుకాణంలో జరిగిన అగ్నిప్రమాద ఘటన ఐదుగురు మృతి చెందారు. ఈ విషాధ ఘటన మరువక ముందే ఫిబ్రవరి 20న అమీర్‌పేట మైత్రీవనం చౌరస్తాలోని ఆదిత్య ఎన్‌క్లేవ్ భవనంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో చిక్కుకున్న ప్రాణాలతో బయటపడ్డారు. తాజాగా జూబ్లీహిల్స్?లోని ఓ వస్త్రదుకాణంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది.

ప్రాణాలతో బయటపడిన ఆ నలుగురు : జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36లోని ఓ వస్త్రదుకాణంలో జరిగిన అగ్ని ప్రమాదం కలకలం సృష్టించింది. చెక్‌పోస్ట్ మెట్రో స్టేషన్ సమీపంలోని ఓ వస్త్ర దుకాణం వెలపల అంటుకున్న మంటలు క్రమంగా నాల్గో అంతస్తు వరకూ వ్యాపించాయి. భవనానికి ముందు భాగంలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్?తో చేసిన దేవాలయ నమూనా పూర్తిగా దగ్ధమైంది. గత కొంత కాలంగా స్టోర్ మూసి వేసి లోపల ఆధునీకరణ పనులు చేస్తున్నారు. వారం రోజులుగా నలుగురు అక్కడ పని చేస్తున్నారు. వారంతా మంటలు గమనించి అతి కష్టంమీద బయటకు వచ్చారు.

వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం : మొదటి అంతస్తు నుంచి వ్యాపించిన మంటలు నాల్గో అంతస్తు వరకూ వ్యాపించడం గమనించిన స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందిచారు. ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారు. ఘటనాస్థలంలో డీఆర్ఎఫ్, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు సైతం చేరుకుని ఫైర్ సిబ్బందికి ఆటంకం కలగకుండా చూశారు.

చనిపోతామని భయమేసింది : వారం రోజులుగా లోపల వెల్డింగ్ సహా ఇతర పనులు చేస్తున్న నలుగురు పనివాళ్లు ఈ ఘటనతో ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. మొదటి అంతస్తులో పని చేస్తుండగా తొలుత మంటలు కింద అంటుకోగా, క్రమంగా నాల్గో అంతస్తు వరకూ వ్యాపించాయి. మంటలు చూసి వెంటనే అక్కడి నుంచి పై అంతస్తులకు వెళ్లారు. పొగలు దట్టంగా ఉండటంతో ఊపిరాడక ఇబ్బందులు పడ్డారు. చివరకు మొదటి అంతస్తులో భవన అద్దాలను పగలకొట్టి బయటపడ్డారు. మంటలు వచ్చిన వెంటనే తమతో పాటు ఉన్న ఓనర్ బయటకు వెళ్లిపోయాడని, తమను అప్రమత్తం చేసి ఉంటే ఇంకా ముందే బయటకు వచ్చేవాళ్లమని పని వాళ్లు చెబుతున్నారు. ఓ దశలో శ్వాస ఆడక చనిపోతామని భయమేసిందని వెల్లడించారు. మరోవైపు ఘటనాస్థలాన్ని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ పరిశీలించారు. ఘటనపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునారావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## న్యాయవ్యవస్థపై తుపాకీ పేల్చారు!

నెత్తురోడుతోంది.. సీజేఐ సూర్యకాంత్ తీవ్ర ఆవేదన

ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి సాంఘిక శాస్త్రం కొత్త పాఠ్యపుస్తకంపై సంపూర్ణ నిషేధం

భౌతిక, డిజిటల్ ప్రతులన్నీ సీజ్ చేయాలి

దీని వెనుక లోతైన కుట్ర కనిపిస్తోంది

బాధ్యులపై వేటు పడక తప్పదు: సీజేఐ

ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌కు షోకాజ్ నోటీసులు

కేంద్ర పాఠశాల విద్య కార్యదర్శికి కూడా..

తదుపరి విచారణ మార్చి 11కి వాయిదా

ఎన్‌సీఈఆర్‌టీ తీరుపై మోదీ అసంతృప్తి

బాధ్యులను శిక్షించాల్సిందేనని స్పష్టీకరణ?

దీనిపై బాధ పడుతున్నాం.. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం: ధర్మేంద్ర ప్రధాన్



## బంధం బలోపేతం

- రెండు దేశాల మధ్య ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం
- త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం
- ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూతో భారత ప్రధాని మోదీ భేటీ
- కీలక రంగాల్లో కలిసికట్టుగా పని చేయాలని తీర్మానం
- భారత్, ఇజ్రాయెల్ మధ్య 17 ఒప్పందాలపై సంతకాలు
- ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబం
- ప్రపంచంలో ఉగ్రవాదానికి స్థానం లేదు



భారత్, ఇజ్రాయెల్ దేశాలు కాల పరీక్షకు నిలిచిన తమ అనుబంధాన్ని ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చుకున్నాయి. త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని, ఇందుకోసం చర్చలు వేగవంతం చేయాలని నిర్ణయానికొచ్చాయి. గాజా శాంతి ప్రణాళికను భారత ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఘర్షణల వల్ల మానవత్వం బలి కావొద్దని అన్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం ఇజ్రాయెల్‌కు చేరుకున్న ప్రధాని మోదీ గురువారం జెరూసలేంలో ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూతో సమావేశమయ్యారు.

## నేటి నుంచి కెనడా ప్రధాని పర్యటన

ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్న మార్క్ కార్నీ



## శాసన మండలిలో గందరగోళం

- టీడీపీ, వైసీపీ మధ్య మాటల యుద్ధం
- టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య మాటల యుద్ధం..
- సీమకు చంద్రబాబు ద్రోహం చేస్తున్నారన్న వైసీపీ సభ్యులు..
- ఏ ముఖ్యమంత్రి చేయనంత ద్రోహం జగన్ చేశారని టీడీపీ కౌంటర్..
- పోటాపోటీగా వైసీపీ, కూటమి సభ్యుల నినాదాలు..
- గందరగోళ పరిస్థితులతో సభను వాయిదా వేసిన చైర్మన్..



# పోలవరం-నల్లమల సాగర్ అనుసంధాన ఏ రాష్ట్రానికీ నష్టం లేదు: సీఎం చంద్రబాబు

పోలవరం-నల్లమల సాగర్ అనుసంధాన ప్రాజెక్టుతో ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని, దీనిపై పొరుగు రాష్ట్రం అభ్యంతరాలు వ్యక్తం చేయాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వృథాగా సముద్రంలోకి పోతున్న గోదావరి వరద జలాలను మాత్రమే ఈ ప్రాజెక్టు ద్వారా తరలిస్తామని ఆయన శాసనసభలో వివరించారు. గోదావరిపై ఎగువ రాష్ట్రం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినప్పుడు తాము ఎన్నడూ అభ్యంతరం చెప్పలేదని గుర్తుచేశారు. ఈ అనుసంధాన ప్రాజెక్టు వల్ల రెండు తెలుగు రాష్ట్రాలకూ మేలు జరుగుతుందని ఆయన అన్నారు. గురువారం నాడు శాసనసభలో సాగునీటి రంగంపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి ప్రసంగించారు.

**మే 15కే నారుమళ్లకు నీళ్లు**

రాష్ట్రంలో నీటి భద్రతకు కూటమి ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకెళుతోందని చంద్రబాబు తెలిపారు. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా నీటి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, పరిశ్రమలు, పెట్టుబడులకు నీరే కీలకమని అన్నారు. రాష్ట్రంలోని జలాశయాల్లో ప్రస్తుతం 793 టీఎంసీల నీరు నిల్వ ఉందని, అందుకే ఈసారి పంటల సీజన్‌ను ముందుకు జరిపి, వచ్చే ఏడాది మే 15 నుంచే నారుమళ్లకు నీరందించేలా ప్రణాళిక రచించామని ప్రకటించారు. ఈ విషయంపై రైతులను చైతన్యవంతం చేయాలని ప్రజాప్రతినిధులకు ఆయన సూచించారు. ప్రతి ఎకరాకు నీరందించి తెలుగు తల్లికి జలహారతి ఇవ్వడమే తన లక్ష్యమని, దీనికోసం రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై త్వరలోనే ఒక బ్లూప్రింట్ విడుదల చేస్తామని వెల్లడించారు.

**ప్రాజెక్టులన్నీ మా హయాంలో కట్టినవే**

రాష్ట్రంలో నిర్మించిన ప్రాజెక్టులన్నీ తమ హయాంలోనివేనని చంద్రబాబు స్పష్టం చేశారు. 2014-19 మధ్య సాగునీటి రంగానికి రూ.68 వేల కోట్లు ఖర్చు చేశామని గుర్తుచేశారు. ఎన్టీఆర్ హయాంలోనే రాయలసీమకు తెలుగు గంగ, గాలేరు నగరి, హంద్రీనీవా వంటి ప్రాజెక్టులు వచ్చాయని, తాము పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీళ్లిచ్చి, శ్రీశైలంలో 100 టీఎంసీలు రాయలసీమకు తరలించామని వివరించారు. అందుకే ఆ ప్రాంతం నేడు రతనాల సీమగా మారుతోందన్నారు.

**వెలిగొండపై గత పాలకుల క్రెడిట్ చోరీ**

గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. వెలిగొండ ప్రాజెక్టుకు నీళ్లు రాకుండానే రిబ్బన్ కట్ చేసి క్రెడిట్ కొట్టేసే ప్రయత్నం చేశారని ఎద్దేవా చేశారు. 30 ఏళ్ల క్రితం శంకుస్థాపన చేసిన ఆ ప్రాజెక్టు మొదటి దశను ఈ ఏడాది జూలైలోనే పూర్తి చేసి నీళ్లిస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్టు పూర్తికి మరో రూ.2500 కోట్లు అవసరమని, ఇప్పటికే ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు రూ.456 కోట్లతో శంకుస్థాపన చేశామని తెలిపారు. అదేవిధంగా కుప్పం కాలువలో ట్యాంకర్లతో నీళ్లు పోసి ప్రచారం చేసుకున్నారని విమర్శించారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేసి డయాఫ్రాం వాల్‌ను గోదావరిలో కలిపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రాజెక్టును మళ్లీ పరుగులు పెట్టించి పుష్కరాల కంటే ముందే పూర్తి చేస్తామన్నారు.

**ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు**

ప్రస్తుతం రాష్ట్రంలోని జలాశయాలు 793 టీఎంసీల నీటితో కళకళలాడుతున్నాయని సీఎం తెలిపారు. జల సంరక్షణ చర్యల వల్ల రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాలు సగటున 6 మీటర్లు పెరిగాయని, దీనివల్ల రూ.91 కోట్ల విద్యుత్ ఆదా అయిందని వివరించారు. తాను చేయని తప్పుకు 53 రోజులు జైల్లో పెట్టారని, అయినా రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నీరివ్వాలన్న సంకల్పంతో పనిచేస్తున్నానని అన్నారు. నీటి భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని, కొందరు కేవలం రాజకీయం కోసమే నీటి సమస్యలను సృష్టిస్తున్నారని విమర్శించారు. ప్రతి ఇంటికీ తాగునీరు, ప్రతి ఎకరాకు సాగునీరు, పరిశ్రమలకు నీరు అందించడమే లక్ష్యంగా ముందుకెళతామని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# శాసన మండలిలో గందరగోళం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలిలో తీవ్ర గందరగోళం కొనసాగుతుంది. సభ ప్రారంభమైన ఐదు నిమిషాలకు మళ్ళీ వాయిదా పడింది. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మాటలకు సమాధానం చెప్పాలని వైసీపీ సభ్యుల నినాదాలు చేశారు. తమ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు పూర్తి కాకుండానే మరో ప్రశ్నకు వెళ్లడంపై మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సభా సంప్రదాయాలు ఉంటాయి.. ఒక ప్రశ్నకు సమాధానం పూర్తి కాకుండానే మరో ప్రశ్నకు వెళ్ళటం సరికాదన్నారు. ఇరిగేషన్ మంత్రి ఉపన్యాసంతో మాకు అభ్యంతరం లేదు.. ఆయన ఏదో చెప్పుకున్నారు.. రేవంత్ రెడ్డి వాళ్ళ అసెంబ్లీలో మాట్లాడిన మాటలు కట్టుబడి ఉన్నారా లేదా అనే దానికి క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం ఉందని బొత్స డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య మాటల యుద్ధం చెలరేగింది. రాయతసీమకు సీఎం చంద్రబాబు తీరని ద్రోహం చేస్తున్నారు అంటూ వైసీపీ సభ్యులు ఆరోపణలు చేయగా.. ఏ ముఖ్యమంత్రి చేయనంత ద్రోహం వైఎస్ జగన్ చేశారని తెలుగు దేశం పార్టీ సభ్యులు కౌంటర్ ఇచ్చారు. దీంతో పోటా పోటీగా వైసీపీ, కూటమి సభ్యుల నినాదాలు చేశారు. గందరగోళ పరిస్థితులతో సభను మండలి చైర్మన్ వాయిదా వేశారు.

# 'మా కుమార్తె చికిత్సకు సాయం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు' : పునర్విక తల్లిదండ్రులు

చిన్నారి పునర్విక పేరు గత కొద్ది రోజులుగా వైరలవుతోంది. ఈ పసి ప్రాణానికి పునర్జన్మను ఇవ్వడం కోసం 2 తెలుగు రాష్ట్రాల యువత కలిసి విరాళాలు సేకరిస్తున్న విషయం తెలిసిందే. పునర్విక వైద్యం కోసం ఎంతోమంది తమకు తోచిన విధంగా సాయం చేశారు. తమకు సాయం చేయాలని మంత్రి నారా లోకేశ్? దృష్టికి కూడా ఈ విషయం చేరింది.

**ఆ రూ.6 కోట్లు నేను సమకూరుస్తా:** కాగా దీనిపై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి పునర్విక చికిత్స బాధ్యత తాను తీసుకుంటానని అందుకు అవసరమైన రూ.6 కోట్లు సమకూరుస్తానని భరోసా ఇచ్చారు. పునర్విక ప్రాణాలు కాపాడే ఇంజెక్షన్ ధర రూ.16 కోట్లు కాగా ఇప్పటికే దాతలు ముందుకొచ్చి రూ.10 కోట్లు సమకూర్చడం హర్షణీయమని అన్నారు. పాప ఆరోగ్యం కోసం సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసినవారు, ప్రార్థించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. చిన్నారి పూర్తి ఆరోగ్యవంతురాలు అయ్యేందుకు అవసరమయ్యే అన్ని చర్యలూ తీసుకోవాల్సిందిగా తన సిబ్బందిని ఆదేశించినట్లు వెల్లడించారు. పాప పరిస్థితిని వివరిస్తూ ఆమె తల్లిదండ్రులు ఎక్స్ వేదికగా నారా లోకేశ్‌కు చేసిన విజ్ఞప్తిపై ఆయన ఈ మేరకు స్పందించారు.

**ఈ పునర్విక ఎవరంటే:** పునర్విక కర్నూలు జిల్లాలోని వెల్దుర్తికి చెందిన సురేశ్‌కుమార్, పుష్పావతి దంపతులకు 2025 ఏప్రిల్ 12న జన్మించింది. అయితే 6 నెలలైనా పాపలో కదిలికలు లేకపోవడంతో తల్లిదండ్రులు వైద్య పరీక్షలు చేయించారు. అప్పుడు పాప అరుదైన ఎస్ఎంఏ టైప్-1(స్పైనల్ మస్క్యులర్ ఆంట్రోఫీ) అనే సమస్యతో బాధ పడుతున్నట్లు బయటపడింది. దీనికి రూ.16 కోట్ల విలువ చేసే ఇంజెక్షన్ మాత్రమే చికిత్స అని డాక్టర్లు చెప్పారు. దీంతో ఆ చిన్నారి కోసం తెలుగు రాష్ట్రాల యువత కదిలింది. చిన్నారి పరిస్థితిని వివరిస్తూ సోషల్ మీడియాలో వరుసగా పోస్ట్‌లు పెట్టారు. ఇప్పటి వరకూ ఆ పాప కోసం రూ.10 కోట్లు సేకరించారు.

**ధన్యవాదాలు తెలిపిన చిన్నారి తల్లీదండ్రులు:** ఈ సందర్భంగా చిన్నారి తల్లీదండ్రులు సురేష్, పుష్పావతి దంపతులు మంత్రి నారా లోకేశ్?కి ధన్యవాదాలు తెలిపారు. సురేష్, ఉమ దంపతుల కూతురు పునర్విక చికిత్స కోసం 16 కోట్ల రూపాయలు విలువ చేసే జోల్ జెలిస్మా ఇంజెక్షన్ అవసరం ఉంటుంది. సాదారణ కుటుంబానికి చెందిన పునర్విక తల్లిదండ్రులు ఈ విషయంపై మొదట సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. దీంతో పెద్ద ఎత్తున దాతలు సహకరించి రూ.10 కోట్లు ఇచ్చారని రాష్ట్ర ప్రభుత్వం తరుపున మంత్రి నారా లోకేశ్? రూ.6 కోట్లు ఇస్తామని చెప్పడం సంతోషంగా ఉందని తెలిపారు. పాప ఆరోగ్యం కోసం సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసినవారు, ప్రార్థించిన వారు, రాష్ట్ర ప్రభుత్వానికి, మంత్రి లోకేశ్?కి, దాతలందరికీ వారు ధన్యవాదాలు తెలిపారు.

**నా హృదయం ముక్కలైంది:** అలానే పునర్విక పరిస్థితిపై నటుడు మంచు మనోజ్ కూడా స్పందించారు. చిన్నారి పరిస్థితి గురించి తెలిసి తన హృదయం ముక్కలైందని తెలిపారు. పాప కోసం ఇంతమంది కదిలి ఫండ్ కలెక్ట్ చేయడం నిజంగా అభినందనీయమని కొనియాడారు. ఆ చిన్నారికి సాయం అందేలా చూడాలంటూ పీఎంవో, తెలుగు రాష్ట్రాల సీఎంలను ట్యాగ్ చేస్తూ ఎక్స్?లో పోస్ట్ చేశారు. చిన్నారి ప్రాణాలు కాపాడగలిగితే ఆ కుటుంబంతో పాటు అందరూ గెలిచినట్లేనని అన్నారు. అలానే దీనిపై స్పందించిన మంత్రి నారా లోకేశ్?కి మనోజ్ ధన్యవాదాలు తెలిపారు.

**ఎస్ఎంఏ టైప్-1 అంటే ఏంటి:** స్పైనల్ మస్క్యులర్ ఆంట్రోఫీ అనేది ఓ జన్యు సమస్య. ఇది వెన్నుపాములోని ప్రత్యేకమైన నాడీ కణాల మీద తీవ్ర ప్రభావం చూపుతుంది. కూర్చోవటం, నిల్చోవటం, పాకటం, నడవటం, మింగటం, శ్వాస తీసుకోవటం వంటి పనులకు సాయం చేసే కండరాలను నియంత్రించేవి ఈ కణాలే. ఇవి క్షీణించినా, మరణించినా కండరాలు క్రమంగా బలహీనమవుతాయి. వీటి పనితీరు అస్తవ్యస్తమవుతుంది. దీంతో పిల్లలు కూర్చోవటం, లేవటం, నడవటం కష్టంగా మారుతుంది. కొన్నిసార్లు శ్వాస తీసుకోవటం, మింగటమూ ఇబ్బంది కావొచ్చు. అయితే వీరిలో తెలివి తేటలు సాధారణంగానే ఉంటాయి. కానీ కాళ్లూ చేతుల వంటి భాగాలు కదలికలు దెబ్బతింటాయి. మానసికంగా చురుకుగా, అప్రమత్తంగా ఉన్నప్పటికీ కండరాల బలహీనత మూలంగా అంత వేగంగా స్పందించలేరు.

# నేటి నుంచి కెనడా ప్రధాని పర్యటన

న్యూఢిల్లీ: కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ నాలుగు రోజుల భారత పర్యటన శుక్రవారం మొదలుకానుంది. భారత ప్రధాని మోదీ, కెనడా ప్రధాని కార్నీల మధ్య చర్చలు ఇరుదేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే లక్ష్యంలో విజయం సాధించనున్నాయని భారత్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. కార్నీ భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. 2023లో కెనడాలో ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య తర్వాత ఇరుదేశాల నడుమ సంబంధాలు పూర్తిగా క్షీణించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో సత్సంబంధాల బలోపేతం కోసం కార్నీ భారత్‌లో పర్యటిస్తున్నారు. జూన్‌లో కననాస్కిస్, నవంబర్‌లో జొహన్నెస్‌బర్గ్‌లో ఇరుదేశాల అగ్రనేతల భేటీల తర్వాత రెండుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంలో భాగంగా పలు రంగాల్లో సహకారంపై మోదీ, కార్నీలు చర్చించనున్నారు. ఇరునేతలు సోమవారం ఇండియా--కెనడా సీఈవో ఫోరమ్‌లో పాల్గొంటారు. తర్వాత వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, భూఅయస్కాంతాలు, వ్యవసాయం, విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, ఇరుదేశాల ప్రజల మధ్య సత్సంబంధాల వంటి అంశాల్లో సహకారంపై చర్చలు జరపున్నారు.

# బంధం బలోపేతం

భారత్, ఇజ్రాయెల్ దేశాలు కాల పరీక్షకు నిలిచిన తమ అనుబంధాన్ని ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చుకున్నాయి. త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని, ఇందుకోసం చర్చలు వేగవంతం చేయాలని నిర్ణయానికొచ్చాయి. గాజా శాంతి ప్రణాళికను భారత ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఘర్షణల వల్ల మానవత్వం బలి కావొద్దని అన్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం ఇజ్రాయెల్‌కు చేరుకున్న ప్రధాని మోదీ గురువారం జెరూసలేంలో ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూతో సమావేశమయ్యారు.

ఇరుదేశాల సంబంధాలతోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై వారిద్దరూ సుదీర్ఘంగా చర్చించారు. భారతదేశ రక్షణ ప్రయోజనాలు మధ్య ఆసియాలో శాంతి, స్థిరత్వంతో ప్రత్యక్షంగా ముడిపడి ఉన్నాయని మోదీ ఉద్ఘాటించారు. కల్లోలిత గాజాలో సాధ్యమైనంత త్వరగా శాంతియుత పరిస్థితులు నెలకొనాలని కోరుకుంటున్నట్లు స్పష్టంచేశారు. మోదీ, నెతన్యాహూ భేటీ సందర్భంగా భారత్, ఇజ్రాయెల్ మధ్య మొత్తం 17 ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. కృత్రిమ మేధ(ఏఐ), వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, తయారీ, సంస్కృతి, సముద్ర సంబంధిత వారసత్వ బంధం, వ్యవసాయం తదితర కీలక రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పటిష్టం చేసుకోవడమే ధ్యేయంగా ఇరుదేశాలు ఈ ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. అంతేకాకుండా రక్షణ భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని తీర్మానించాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని పరస్పరం బదిలీ చేసుకోవడం ద్వారా మిలటరీ హార్డ్‌వేర్ అభివృద్ధి, ఉత్పత్తి విషయంలో కలిసికట్టుగా పనిచేయాలని నిర్ణయించాయి.

**ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబం**

మోదీ, నెతన్యాహు సమావేశంలో అమెరికా--ఇరాన్ ఘర్షణ అంశంతోపాటు మధ్య ఆసియా పరిణామాలు ప్రత్యేకంగా ప్రస్తావనకు వచ్చాయి. సమస్యలు, సంక్షోభాలను సంప్రదింపులు, దౌత్య మార్గాలను పరిష్కరించుకోవాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అమెరికా--ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు చల్లారడానికి శాంతియుత పరిష్కారం కోసం తమవంతు సాయం అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. భారత్, ఇజ్రాయెల్ దేశాలు తమ సంబంధాన్ని 2017లో వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి చేర్చాయి. తాజాగా ఆ బంధం ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంగా మారింది.

**ప్రపంచంలో ఉగ్రవాదానికి స్థానం లేదు**

ఆర్థిక సహకారమే రెండు దేశాలకు గ్రోత్ ఇంజన్ అని ప్రధానమంత్రి మోదీ పేర్కొన్నారు. పరస్పరం పెట్టుబడులను ప్రోత్సహించుకోవడానికి గత ఏడాది ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందంపై సంతకాలు చేశామని వెల్లడించారు. అతి త్వరలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) కుదుర్చుకోబోతున్నామని ప్రకటించారు. ఇరుదేశాలకూ లబ్ధి చేకూర్చేలా ఈ ఒప్పందం ఉంటుందన్నారు. ఉగ్రవాదంపై ఉమ్మడిగా పోరాటం సాగించాలని తాము నిర్ణయించినట్లు చెప్పారు. ఈ ప్రపంచంలో ఉగ్రవాదానికి స్థానం లేదన్నారు. అత్యాధునిక సాంకేతికతల విషయంలో ఇజ్రాయెల్‌తో భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకుంటామన్నారు.

ఏఐ, క్వాంటమ్, క్రిటికల్ మినరల్స్ విషయంలో సహకారాన్ని వేగవంతం చేస్తామని వివరించారు. భారత యూపీఐ సేవలను ఇజ్రాయెల్‌లో ప్రవేశపెట్టడానికి ఒప్పందం కుదిరినట్లు తెలిపారు. రక్షణ రంగంతోపాటు పౌర అణు ఇంధనం, అంతరిక్ష రంగాల్లో సహకారాన్ని మరింత పటిష్టం చేసుకుంటామని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదనకు సాంకేతిక సాయం అందించడానికి ఇజ్రాయెల్‌తో కలిసి 'సెంటర్స్ ఆఫ్ ఎక్స్‌లెన్స్' సంఖ్యను పెంచుతామన్నారు. నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టిన దేశాలకే ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ స్పష్టంచేశారు. భారత్, ఇజ్రాయెల్ ఈ రంగంలో కలిసి పని చేస్తాయన్నారు.

**ఎఫ్‌టీఏపై మూడు నెలల్లో చర్చలు**

భారత్, అమెరికా మధ్య ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై తదుపరి దశ చర్చలు మే నెలలో జరుగుతాయని కేంద్ర వాణిజ్య శాఖ వెల్లడించింది. నాలుగు రోజులపాటు జరిగిన మొదటి దశ చర్చలు ఇటీవలే ముగిశాయి. వస్తువులు, సేవల్లో వాణిజ్యం, మేధో సంపత్తి హక్కులు, డిజిటల్ ట్రేడ్ వంటి అంశాలపై ఇరుపక్షాలు సంప్రదింపులు జరిపాయి. భారత్, ఇజ్రాయెల్ మధ్య వాణిజ్యం 3.62 బిలియన్ డాలర్లకు చేరింది. ఆసియాలో ఇజ్రాయెల్‌కు రెండో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి భారత్ కావడం విశేషం.

**టెక్ కంపెనీలకు ఆహ్వా?వనం**

భారత్‌లో పెట్టుబడులకు ముందుకు రావాలని ఇజ్రాయెల్ టెక్నాలజీ కంపెనీలను మోదీ ఆహ్వా?వనించారు. భారత యువతతో కలిసి పనిచేయాలని కోరారు. జెరూసలేంలో ఏఐ, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయానికి సంబంధించిన ప్రదర్శనను బెంజమిన్ నెతన్యాహూతో కలిసి మోదీ తిలకించారు. దీనిపై 'ఎక్స్'లో పోస్టుచేశారు.

**'భారతీయ' యూదులతో మోదీ భేటీ**

భారతీయ మూలాలున్న యూదులతో ప్రధాని మోదీ గురువారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారితో ఆత?మయంగా సంభాంచారు. ఇజ్రాయెల్‌లో 85 వేల మందికిపైగా భారతీయ మూలాలున్న యూదులు ఉన్నారు. వీరిలో చాలామంది భారత్ నుంచి వలసవచ్చి?చనవారే. ప్రధాని మోదీ మాటల మనిషి కాదు.. చేతల మనిషి అని యూదు ప్రముఖుడు, అష్కెలాన్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ రికీ షాహ్ అన్నారు. మోదీతో భేటీ కావడం పట్ల ఆయన ఆనందం వ్యక్తంచేశారు. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ ఇజ్రాయెల్‌లో రెండు రోజుల పర్యటన పూర్తిచేసుకొని గురువారం సాయంత్రం స్వదేశానికి బయలుదేరారు. ఇజ్రాయెల్ అధ్యక్షుడితో మాటామంతి తదితర అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. భారత్‌లో పర్యటించాలంటే హెర్జోగ్‌ను మోదీ

# రేపు రాష్ట్రానికి సీజేఐ

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ రెండు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రానికి రానున్నారు. శనివారం సాయంత్రం ఆయన నేరుగా తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకుంటారు. తిరుపతిలో నిర్మించనున్న 16 కోర్టుల భవన నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేస్తారు. అక్కడి నుంచి విజయవాడకు వస్తారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు రాజధాని అమరావతికి చేరుకొని ఏపీ జ్యుడీషియల్ అకాడమీ, హైకోర్టు గెస్ట్‌హచి?సలకు శంకుస్థాపన చేస్తారు. హైకోర్టు వద్ద నూతనంగా నిర్మించిన న్యాయమూర్తుల నివాస సముదాయాన్ని ప్రారంభిస్తారు. ఆ తర్వాత అక్కడ నిర్వహించే సభలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబుతో కలిసి పాల్గొంటారు. ఆదివారం సాయంత్రం విజయవాడ పటమటలోని అంత్ర లగ్జె కన్వెన్షన్ సెంటర్‌లో మధ్యవర్తిత్వంపై నిర్వహించే సదస్సులో సీజెఐ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తారు. రాత్రికి దిల్లీకి తిరుగుప్రయాణమవుతారు. సీజేఐ పర్యటన ఏర్పాట్లపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ గురువారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ దక్షిణ భారతంలోనే తొలిసారిగా అత్యంత ప్రతిష్టాత్మకంగా మధ్యవర్తిత్వంపై జరగనున్న సింపోజియంకు సీజేఐతోపాటు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, హైకోర్టు న్యాయమూర్తులు, అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని వివరించారు. అతిథులకు అవసరమైన వసతితోపాటు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, పటిష్ఠ భద్రతపైనా దృష్టిసారించామని తెలిపారు. కార్యక్రమంలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయడంలో సమన్వయ శాఖల అధికారులు భాగస్వాములు కావాలని కోరారు.

# న్యాయవ్యవస్థపై తుపాకీ పేల్చారు!

'న్యాయవ్యవస్థలో అవినీతి' పాఠ్యాంశాన్ని 8వ తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకంలో చేర్చిన జాతీయ విద్యాపరిశోధన-శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ)పై సుప్రీంకోర్టు మరోసారి మండిపడింది. న్యాయవ్యవస్థపై తుపాకీ పేల్చారని.. అది రక్తమోడుతోందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. 'ఎక్స్‌ప్లోరింగ్ సొసైటీ: ఇండియా అండ్ బియాండ్ (పార్ట్2)' పేరుతో ఉన్న సదరు పాఠ్యపుస్తకాన్ని సంపూర్ణంగా, సమగ్రంగా నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. దాని భౌతిక, డిజిటల్ ప్రతులను సీజ్ చేయాలని ఆదేశించారు. పుస్తకాన్ని మళ్లీ ప్రచురించడం గానీ, ముద్రించడం గానీ చేయరాదని.. డిజిటల్‌గానూ పంపిణీ చేయరాదని స్పష్టంచేశారు. ఇంత వివాదాస్పద అంశాన్ని పాఠ్యపుస్తకంలో చేర్చిన వారిపై ఎందుకు కోర్టు ధిక్కార చర్యలు తీసుకోకూడదో చెప్పాలంటూ ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌కు, కేంద్ర పాఠశాల విద్య కార్యదర్శికి షోకాజ్ నోటీసులు జారీచేశారు. సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వీ బుధవారం.. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం.పంచోలితో కూడిన ధర్మాసనం ముందు ఈ అంశాన్ని ప్రస్తావించగా.. దీనిని సుమోటోగా తీసుకుని ఇప్పటికే ఆదేశాలిచ్చానని చీఫ్ జస్టిస్ చెప్పడం తెలిసిందే. గురువారం త్రిసభ్య ధర్మాసనం సుమోటోగా విచారణ చేపట్టింది. ఈ అధ్యాయంలో అవమానకర అంశాలున్నాయని.. దీని వెనుక చాలా లోతైన కుట్ర కనిపిస్తోందని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. వ్యవస్థ గౌరవ ప్రతిష్ఠలను దెబ్బతీసే ఉద్దేశపూర్వక చర్యగా భావిస్తున్నామని చెప్పారు. 'బాధ్యులపై వేటు పడక తప్పదు. లోతైన దర్యాప్తు జరపాలనుకుంటున్నాం' అని తెలిపారు.

**మీడియాకు సీజేఐ ధన్యవాదాలు**

ఈ అంశాన్ని హైలైట్ చేసినందుకు చీఫ్ జస్టిస్ మీడియాకు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రధాన స్రవంతి మీడియా ఎప్పుడూ బాధ్యతగానే ఉంటుందని సొలిసిటర్ జనరల్ అన్నారు. టాబ్లాయిడ్లు, డిజిటల్ ప్లాట్‌ఫాంలు బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతుంటాయని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు జోక్యాన్ని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది విక్ష?సింగ్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్‌పర్సన్, సీనియర్ న్యాయవాది మనన్‌కుమార్ మిశ్రా స్వాగతించారు.

# గెలుపు



జీవితంలో గెలవాలంటే
కష్టాలను ఓర్చుకోవాలి
నువ్వు పైకి ఎదగాలంటే
గతాన్ని మర్చిపోవాలి
ఉన్నంతంగా బ్రతకాలంటే
ఇష్టాలను ఎంచుకోవాలి.
ఓటమి లేనిదే గెలుపు రాదు
గాయం లేనిదే జ్ఞాపకం రాదు
కష్టం రానిదే ఫలితం దక్కదు
పడే బాధను చూసి బెదిరిపోకు
భయం నిన్ను బలహీనపరుస్తుంది
బలమైన వ్యక్తిగా మారేందుకు
నువ్వు గట్టిగా ప్రయత్నించు.
నిజం చెప్పేవాడికి లోకంలో
శత్రువులు అధికంగా ఉంటారు
పైకి అలా జీవిస్తూ
నటిస్తూ బ్రతికే వాడికి
తన చుట్టూ బంధాలు.
మనిషి అందంగా పుట్టడం
అతని చేతుల్లో ఉండదు
మనిషి మనస్సు కలిగి ఉండడం
అనేది తన చేతుల్లోనే ఉంటుంది
సంపన్న కుటుంబంలో పుట్టడం
ఎవరి చేతుల్లో ఉండదు
సంస్కారంతో బ్రతకడం
మన చేతుల్లోనే ఉంటుంది.

రచన : కె.మురళీమోహన్ రాజు
నెల్లూరు.
చరవాణి : 9866179385

## విజ్ఞాన దిన పత్రిక మరియు ఉదయవాణి టీవీ ఛానల్ కు సంబంధించిన క్యాలెండరు, మరియు డైరీ లను ఆవిష్కరణ



ఆత్మకూరు పట్టణంలో ఆత్మకూరు సర్కిల్ సి ఐ గంగాధర్ ని మర్యాద పూర్వకంగా కలసి 2026 నూతన సంవత్సరం మరియు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ విజ్ఞాన దిన పత్రిక మరియు ఉదయవాణి టీవీ ఛానల్ కు సంబంధించిన క్యాలెండరు, మరియు డైరీ లను ఆవిష్కరణ అయన చేతుల మీదుగా చేయడం జరిగింది.. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ గంగాధర్ మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న అన్ని విషయాలు పట్ల ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధి లాగా పత్రికలు పనిచేసి ప్రజలలో చైతన్యం నింపాలని తెలిపారు.. విజ్ఞాన పత్రిక ఆత్మకూరు పట్టణం మరియు రూరల్ రిపోర్టర్స్ వై. బాబు మరియు-ూా. హరి కృష్ణ ను అభినందించడం జరిగింది.

## మెంబర్ షిప్ టూ లీడర్ షిప్ - ఉద్యమి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**-జెన్ - జీ తరాన్ని పార్టీ కి దగ్గర చేయాలి : జనసేన లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నెల్లూరుజిల్లా జనసేనపార్టీ ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖరరావు**

**-పార్టీ సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ గారి ఆశయాలకు ఆకర్షితులైన ప్రతీ ఒక్కరికీ ఉద్యమి సభ్యత్వాన్ని అందించాలి - జనసేనరాజ మోహన్**

జనసేన పార్టీ చేపట్టిన మెంబర్ షిప్ టూ లీడర్ షిప్ ఉద్యమి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జనసేన లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నెల్లూరుజిల్లా జనసేనపార్టీ ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖరరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గూడూరు నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి వర్యులు గౌ.శ్రీ కొణెదల పవన్ కళ్యాణ్ గారు పార్టీని బలోపేతం చేసేందుకు త్రిశూల వ్యూహాన్ని రచించారని, అందులో భాగంగా ప్రతీ సభ్యున్ని నాయకునిగా తీర్చిదిద్ది పార్టీకి పటిష్టమైన నాయకత్వాన్ని అందించాలని సంకల్పించారని అన్నారు. ఉద్యమి, సాధక్, ప్రధాతల ద్వారా పార్టీకి అదనపు బలాన్ని సమకూర్చేందుకు పవన్ కళ్యాణ్ గారు అడుగులు ముందుకు వేస్తున్నారని ఉద్యమం సాగించే వారే ఉద్యమి, అటువంటి ఉద్యమి లనుండే నాయకుల ఆవిర్భావం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. అధికారంలో ఉండి కూడా తన సొమ్ము కోట్లాది రూపాయలను ప్రజా సంక్షేమం కోసం వినియోగించే గొప్ప వ్యక్తి పవన్ కళ్యాణ్ గారని, అటువంటి నాయకుని, నాయకత్వంలో పనిచేయడం ఓ వరమని అన్నారు. మెంబర్ షిప్ డ్రైవ్ జరిగే రెండు వారాలు కీలకమైనవని అన్నారు. జనసైనికులు, వీర మహిళలు, సాధక్ లు కలసికట్టుగా ముందుకు సాగి, గత ఏడాది కంటే ఎక్కువ సభ్యత్వ నమోదు చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం జూశీషె మోహన్ మాట్లాడుతూ జెన్ – జీ తరం అందరూ జనసేన లో ఉద్యమిలుగా ఉద్యమించే



విధంగా, వారికి సభ్యత్వాలను కల్పించాలన్నారు. కార్యకర్తకు ప్రమాదాల వల్ల కష్టం కలిగినా, వారి కుటుంబాలకు నష్టం వాటిల్లినా ఆదుకునేందుకు రూపొందించిన సభ్యత్వ నమోదు కార్యక్రమం వలన సంఘంలో గౌరవం, కుటుంబంలో భద్రత లభిస్తాయని అన్నారు. జనసేన పార్టీ పై అభిమానం, పవన్ కళ్యాణ్ గారి పట్ల ప్రేమ, పార్టీ సిద్ధాంతం ల మీద గౌరవం ఉన్న వారిని ఉద్యమిలుగా నమోదు చేయాలని అన్నారు. గూడూరు నియోజకవర్గం నుంచి గౌరవ ప్రదమైన సభ్యత్వాల సంఖ్యను నమోదు చేసే విధంగా సమిష్టి కృషి చేయాలని కోరారు. జనసేన పార్టీ సిద్దాంతాలు, శ్రీ పవన్ కళ్యాణ్ గారి ఆశయాలకు ఆకర్షితులైన ప్రతీ ఒక్కరికీ ఉద్యమిగా సభ్యత్వాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు యనమల విజయ్, నాగార్జున,వంశీ కృష్ణ, నవీన్ రాజు, వసంత్, మనోజ్ , భార్గవ్, జస్వంత్ , వీతేష్, మణి, వీరమహిళలు తులసి, పెంచలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కావలి నియోజక వర్గ కార్యకర్తల విస్తృత సమావేశం

**-విజయవంత అవడం పట్ల కాటంరెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపిన మాజీ ముఖ్యమంత్రి జగన్**



అల్లూరు :విజ్ఞాన్ దినపత్రిక న్యూస్

నెల్లూరు పర్యటనకు విచ్చేసిన వైఎస్ఆర్సిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కావలి జరిగిన కార్యకర్త సమావేశం విజయవంత అవడం పట్ల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ సీఈసీ సభ్యులు మాజీ శాసనసభ్యులు శ్రీ కాటంరెడ్డి విష్ణువర్దన్ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ తో ప్రత్యేకంగా పది నిమిషాలు చర్చించడం రాజకీయాల్లో చర్చగా మారింది.

## మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి



కావలి :విజ్ఞాన్ దినపత్రిక న్యూస్

నెల్లూరు జిల్లాలోని విపిఆర్ కన్వెన్షన్ హాల్లో ఓ వివాహానికి హాజరయ్యేందుకు నెల్లూరుకు విచ్చేసిన మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి ని మాజీ ఎమ్మెల్యే మరియు వైఎస్ఆర్సిపి సీఈసీ నెంబర్ కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు నెల్లూరు జిల్లా కనపర్తిపాడు వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి వెళ్లి ఆయనకు ఘన స్వాగతం పలికి జగన్ పై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు ... అలాగే ఇటీవల జరిగిన వైఎస్ఆర్సిపి కావలి నియోజకవర్గ కార్యకర్తల సంస్థ గత సమావేశం విజయవంతం అయిందని తెలిపారు

## కొండ బిట్రగుంటలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి కుమార్తె సంహిత రెడ్డి

**--ప్రజల సుఖసంతోషాల కోసం ప్రత్యేక పూజలు**

నెల్లూరు జిల్లా,బోగోలు మండలం కొండ బిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణం విద్యుత్ కాంతులతో ప్రకాశిల్లుతూ, భక్తుల రద్దీతో కళకళలాడింది. ఈ సందర్భంగా కావలి శాసనసభ్యులు కావ్య క్రిష్ణారెడ్డి కుమార్తె సంహిత రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కావలి నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో,ఆయురారోగ్యాలతో ఉండాలని ఆమె స్వామివారిని ప్రార్థించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయని ఆలయ నిర్వాహకులను ఆమె అభినందించారు. శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవ వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయం చుట్టుపక్కల ప్రాంతాలు "గోవిందా... గోవిందా..." నామస్మరణలతో మారుమోగాయి. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన సంహిత రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు సమర్పించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, కొండ



బిట్రగుంటలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలకు విశేషమైన ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ, అధికారులు, సేవా సిబ్బందిని అభినందించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించడం అభినందనీయం అన్నారు..ఉత్సవాల కాలంలో వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకునే అవకాశం ఉందని చెప్పారు. భక్తి, ఆధ్యాత్మికత, ఆనందోత్సాహాలతో కొండ బిట్రగుంటలో బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి.

## అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మున్సిపాలిటీ పెద్దపల్లిలో శ్రీ కాశీ విశ్వేశ్వర నూతన ఆలయం ప్రారంభోత్సవం





విజ్ఞాన పత్రిక రాంబిల్లి రిపోర్టర్ కోట్ని బాబురావు

అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మునిసిపాలిటీ పెద్దపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది శ్రీమాన్ రేజేటి శ్రీరామచార్యులు పర్యవేక్షణలో పూజా కార్యక్రమం హోమం అభిషేకములతో గుడి ప్రారంభోత్సవం జరిగింది ఈ కార్యక్రమమునకు చుట్టుపక్కల గ్రామంలో నుండి అనేకమంది భక్తులు ఉదయం నుండే వచ్చి దర్శించుకున్నారు మధ్యాహ్నం విచ్చేసినటువంటి భక్తులకు భారీగా అన్న సమారాధన కార్యక్రమం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమమునకు మాజీ శాసనసభ్యులు శ్రీ ఉప్పలపాటి వెంకట రమణ మూర్తి రాజు (కన్నబాబు) నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అనకాపల్లి సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడు ప్రసాద్ మాజీ ఎంపీపీ బోధిపు గోవిందు మాజీ ఎంపీపీ మరీ మరియు మాజీ జడ్పిటిసి సభ్యులు శ్రీ బొద్ధపు ఎర్రయ్యదొర మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు ఆరేపు గుప్తా కశింకోట ఎంపీపీ కలగా గున్నయ్య నాయుడు స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ దాసరి కుమార్ మాజీ సర్పంచ్ కోడిగుడ్డు రమణ గ్రామ పెద్దలు ప్రజలు ఆలయ కమిటీ సభ్యులు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు

## ఘనంగా అల్లూరు నగర పంచాయతీ పరిధి నార్త్ మోపూరు లోని దేవి రెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ నందు వి రెడ్డి శారదమ్మ 9వ వర్ధంతి

అల్లూరు : విజ్ఞాన్ దినపత్రిక న్యూస్



దేవి రెడ్డి శారదమ్మ 9వ వర్ధంతి కార్యక్రమాన్ని అల్లూరు నగర పంచాయతీ పరిధి నార్త్ మోపూరు లోని దేవి రెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ శాసనసభ్యులు కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి విచ్చేసి శారదమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ట్రస్టు నందు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ నెల్లూరు వారి సౌజన్యంతో ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ రక్తదాన శిబిరంలో 110 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు దేవిరెడ్డి దశరథ రామి రెడ్డి. ట్రస్ట్ అడ్మిన్ మేనేజర్ అనిల్ కుమార్ రెడ్డి. అనంతరాజు బాలకృష్ణం రాజు,డాక్టర్ జెట్టి రమేష్ రెడ్డి. ప్రిన్సిపల్ శ్రీలత చౌదరి. స్కిల్ డెవలప్మెంట్ ఇంచార్జ్ రామచంద్రయ్య. ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా రాక్ సైన్స్ ఎక్స్ పో

నెల్లూరు సిటీ.... ఫిబ్రవరి 26/ .(విజ్ఞాన్ పత్రిక ప్రతినిధి



.నేషనల్ సైన్స్ డే ని పురస్కరించుకొని గురువారం అంబా పురం లోని రాక్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ లో ఘనంగా రాక్ సైన్స్ ఎక్స్ పో కార్యక్రమం నిర్వహించారు...ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ సెక్రటరీ యన్, సుబ్బయ్య,మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే సాంకేతిక స్కిల్,సైన్స్ అండ్ టెక్నాలజీ గేమ్స్ క్రీడలలో రాణించాలని అన్నారు.. ఈ కార్యక్రమం లోరాక్ స్కూల్ కరస్పాండెంట్ ప్రశాంతి రాణి తో పాటు విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.. విద్యార్థులు 200/సైన్స్ మెటీరియల్స్ ను ప్రదర్శించారు...

## పక్కా గృహాలు, స్థలాల మంజూరులో గతంలో జరిగిన తప్పిదాలను పునరావృత్తం చేయకండి

**- అనర్హులకు కేటాయించిన ఇళ్ల పట్టాలు రద్దు చేయండి.**

**- బిల్లులు డ్రా చేసుకొని ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోండి.**

**- పేదల ఇంటి స్థలాల కోసం ప్రభుత్వ భూములను గుర్తించండి.**

**- హౌసింగ్ అధికారులతో సమీక్ష సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి.**

కోవూరు /విజ్ఞాన్ )

రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని అర్హులైన నిరుపేదలకు త్వరితగతిని ఇంటి స్థలాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి హౌసింగ్ అధికారులను ఆదేశించారు. నెల్లూరు నగరం మాగుంట లేఔట్ లోని విపిఆర్ నివాసంలో హౌసింగ్ మరియు రెవెన్యూ అధికారులతో ఆమె కోవూరు నియోజకవర్గ పరిధిలో ఇళ్ల నిర్మాణం మరియు ఇంటి స్థలాలకు సంబంధించిన పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా గిరిజనులకు 1,000 పక్కా గృహాలు మంజూరై ఉన్నాయని ఇళ్ల నిర్మాణం కోసం మండలాల వారీగా భూసేకరణ చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటి స్థలాలు మరియు పక్కా ఇళ్ళు పొందిన లబ్ధిదారులను గుర్తించి వారు పొందిన ఇంటి స్థలాలు మరియు పక్కా ఇళ్ళు రద్దు చేసి అర్హులైన పేదలకు యివ్వాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో వేసిన లే అవుట్లలో లబ్ధిదారులతో మాట్లాడి అసంపూర్తిగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడంతో పాటు ఖాళీ ప్లాట్లు అర్హులైన పేదలకు పంపిణీకి సిద్ధం చేయాలన్నారు. పేదల పక్కా ఇళ్ల నిర్మాణంలో అవినీతికి పాల్పడడంతో పాటు బిల్లులు డ్రా చేసుకొని అసంపూర్తిగా వదిలేసిన కాంట్రాక్టర్లపై చట్టపర చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి హౌసింగ్ అధికారులను ఆదేశించారు. కోర్టు వివాదాల కారణంగా ఇంటి పట్టాల



పంపిణీలో జరుగుతున్న జాప్యాన్ని స్థానిక నాయకులు ప్రత్యేక చొరవ తీసుకొనిసామరస్యంగాపరిష్కరించాలని కోరారు. ఇళ్ళు లేని నిరుపేదలకు పక్కా ఇళ్ళు, ఇంటి స్థలాల మంజూరులో ఉదాసీనంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి హెచ్చరించారు. ప్రధాన మంత్రి గ్రామీణ రోజ్ గార్ యోజన 2.0 ద్వారా నియోజవర్గ వ్యాప్తంగా 9 వేల 73 మందిలబ్ధిదారులు ఎంపికై వున్నారని ఇళ్ల నిర్మాణాలకు త్వరలోనేఇళ్లనిర్మాణాలుచేపట్టబోతున్నట్టు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఇంచార్జ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మోహన్ రావు, హౌసింగ్డిఇవెంకటరత్నం, నియోజకవర్గ పరిధి లోని అన్ని మండలాల హౌసింగ్అసిస్టెంట్ఇంజనీర్లు,తహసీల్దారులు, బుచ్చి మున్సిపల్ కమీషనర్ డి బాలకృష్ణ, బుచ్చి మున్సిపల్ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ మరియు ఏం ఎన్ ఏం ఈ డైరక్టర్రావెళ్లవీరేంద్రనాయుడుఇందుకూరుపేట మండల టిడిపి అధ్యక్షులు ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి చెంచు కిషోర్ యాదవ్, టిడిపి సీనియర్ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, అడపాల శ్రీధర్ రెడ్డి ఇతర టిడిపి నాయకులు స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

